

# 'అదే' కథలు

## – ఆర్.శర్మ దంతుర్తి

ముందు మాట – అమెరికా వచ్చిన భారతీయుల్ని 'దేశీ'లంటారని, వారి దైనందిన జీవితాల్లో జరిగే అనేకానేక విషయాలతో అమెరికా దేశీయ కథలు అనే పేరుతో ఈ వరస కథలు మొదలుపెట్టాను, గౌరవం కోసం 'య' అనేది చేర్చి. ఇందులో చర్చించిన సమస్యలు పూర్తిగా కాకపోయినా చాలా మటుక్కు అన్నీ స్వకపోల కల్పనలు – ఇలా జరిగి ఉండొచ్చని ఊహించి రాసినవి. కొన్ని ఇలా జరిగినట్టు ఇంటర్నెట్ మీదా, వార్తల్లోనూ చదివినవి. అవి మీకు కానీ మీకు తెల్సున్నవాళ్ళకి కానీ జరిగితే అది పూర్తిగా కాకతాళీయం/యాదృచ్ఛికం మాత్రమే. సరదాకి రాసిన ఈ కథలు వినోదంగా చదువుకోవడానికి మాత్రమే. చాలామటుకు నవ్వు వచ్చినా కొన్ని కథల్లో ఏడుపుకూడా రావొచ్చు. ఆ నవ్వులకి, బాధలకి, దుఃఖాలకి నా బాధ్యత లేదు.

## 84

## స్లీప్ డేట్

**సుబ్బారావు గారికి ఇద్దరు పిల్లలు.** పెద్దమ్మాయికి ఎనిమిదేళ్ల వయసులో కాబోలు అమ్మాయి స్నేహితురాలు పుట్టినరోజు పార్టీ అంటే ఒక బహుమతి కొని పంపించాడు. పార్టీ అయ్యాక వచ్చి తీసుకెళ్ళాలి. అయిదింటికి దింపి పార్టీ అయ్యాక ఎనిమిదింటికి తీసుకురావాలి. వెళ్ళడానికి పది మైళ్ళు, రావడానికి పదీను. అలా మొదలైన డేట్ లు తొమ్మిదీ, పదీ పదకొండూ ఏళ్ళకి సాగుతూనే ఉన్నై. సుబ్బారావుగారి గుండె పీచుమంటూనే ఉంది. ఎదిగే పిల్ల ఎవరింట్లోనో అంతసేపు ఉంటే ఎలా అని ఈయన కంగారు. సుబ్బారావు వాళ్ళావిడకి ఇవేం పట్టవు. గాడిదగుడ్డు, ఏమౌతుందేం? అని తీసిపారేస్తుంది ఆవిడ సుబ్బరావు ఏదైనా అంటే. పార్టీ డేట్ లు మెల్లిగా విస్తరిస్తూ స్లీప్ డేట్ గా మారుతున్నాయి. శుక్రవారం వెళ్ళిన అమ్మాయి ఒక్కోరోజు స్నేహితులతో, సినిమాలకి వెళ్ళి వాళ్ళ ఇళ్ళలో పడుకుని శనివారం ఎప్పుడో సాయంత్రం వస్తోంది. ఒక్కొక్కప్పుడు ఈయనే వెళ్ళి తీసుకురావాలి. శనివారం పొద్దున్నే వచ్చేస్తా అని చెప్పిన అమ్మాయి శనివారం మధ్యాహ్నం ఫోన్ చేసి సాయంత్రం రమ్మనీ, ఒక్కోసారి ఆదివారం వస్తాననీ అడుగుతూంటే చిరాకు ఎక్కుతోంది. కోపం వచ్చి ఏదైనా అంటే అమ్మగారూ కూతురూ తనమీద ఎగురుతున్నారు.

పదమూడేళ్ళకి మరోసారి స్లీప్ డేట్ కి వెళ్ళింది అమ్మాయి. శనివారం మధ్యాహ్నం ఫోన్ చేసి పిల్చింది వచ్చి తీసుకెళ్ళమని. ఇంటికి తీసుకురాగానే తన గదిలోకి వెళ్ళి పడుకుంది. మళ్ళీ లేచేసరికి ఆదివారం మధ్యాహ్నం. ఈ లోపుల ఏమీ తిన్నట్టు కానీ, తాగినట్టు కానీ తనకి తెలియదు. టీనేజ్ ఏడుపొకటి, ఏదైనా అంటే తిరగబడి సమాధానం చెప్పడానికి. ఆదివారం మొత్తానికి బయటకి వచ్చింది తన గదిలోంచి. మొహం ఉబ్బి ఉంది, ఏడుపు ఒక్కటే తక్కువ. తల్లీ తండ్రీ ఏమైందో అడిగితే చెప్పదు. చాలాసేపు మాట్లడామని చూసాక ఏదీ కుదరక వెళ్ళి పడుకున్నాడు సుబ్బారావు, ఆయన మర్నాడు ఆఫీసుకెళ్ళొద్దూ? ఏడింటికే ఇంట్లోంచి బయటకెళ్ళాడు ఆయన సోమవారం.

మధ్యాహ్నం ఒంటి గంటకి అమ్మగారు ఫోన్ చేసి చెప్పారు, వెంటనే వెనక్కు వచ్చేయమని, అర్జెంట్ గా ఏదో మాట్లాడాలిట. ఇంటికొచ్చేసరికి మరో గంట. అప్పుడు చెప్పిన విషయాలు విని సుబ్బారావు చేతిమీద గిల్లి చూసుకోవాల్సిన పరిస్థితి. తాను ఏదైతే జరక్కూడదనుకున్నాడో అదే జరిగింది. ఇప్పుడు ఏదైనా అరిస్తే తన అరుపులతో పరిస్థితి మరింత కష్టం కావచ్చు.

స్నేహితురాలి ఇంట్లో పడుకోవడానికి పది మంది పిల్లలు వచ్చారు. అందులో అందరూ తలోచోటా పడుకున్నాక కొంతమంది ఏదో వీడియో గేమ్ ఆడారు. అప్పటికే సుబ్బారావు కూతురు పడుకుంది. ఈ పిల్ల పడుకున్న భంగిమ చూసి ఓ కుర్రాడికో ఆలోచన వచ్చింది. అది ఎవరితో చెప్పకుండా అందరూ పడుకునే దాకా చూసాడు అవకాశం కోసం. వాడు అందరూ పడుకునేదాకా ఆగి వచ్చి సుబ్బారావు కూతురి పక్కనే పడుకున్నాడు. చీకట్లో ఎవరు ఎక్కడ పడుకున్నారో ఎవరూ తెలియలేదు. ఇది అమెరికా బ్రదర్ ఏమీ అవదు అని అమ్మగారు చెప్పలే? ఒక అరగంట గడిచాక ఈ అమెరికా పిల్లాడు సుబ్బారావు కూతుర్ని వాటేసుకుని నోరు మెదపకుండా తన నోటితో చుట్టేసాడు. మెలుకువ వచ్చిన సుబ్బారావు కూతురు ఆ కుర్రాడి కౌగిట్లోంచి బయటకి రావడానికి ప్రయత్నం చేసింది కానీ కుదర్లేదు. వాడు అలాగే ఈ పిల్లని ఓ గంటో రెండు గంటలో తన చేతుల్లోంచి పోనీయకుండా ఉంచి వళ్ళు తడుముతూ ముద్దులు పెడుతూ చెవిలో చెప్పాట్ట – ఈ విషయం ఎవరికైనా చెప్తే చంపేస్తాను అని. ఇదంతా కూతురు తల్లితో చెప్పింది. కూతురి లోపలి బట్టలు చూస్తే, రక్తం మరకలు ఉన్నాయి. తమ కూతురు గానీ రేప్ చేయబడిందా అనేది తెలియదు. అడిగితే ఏమో నేనేం చెప్పలేను, నాకేం జరిగిందో తెలియదు అంటోంది. సుబ్బారావు పెళ్ళాం తో చెప్పాడు, "బుద్ధిలేక నిన్ను నమ్మాను. ఎప్పట్నుంచో చెప్తూనే ఉన్నాను నేను ఈ స్లీప్ డేట్ లు వద్దూ అని, గాడిదగుడ్డు ఏమౌతుందేం, అని నువ్వు తీసిపారేసావు, ఇప్పుడెమైందో చూడు." ఆవిడ ఊరుకుంటుందా, 'ఇప్పుడు చేయాల్సిన పని గురించి ఆలోచించక నన్ను దెప్పుతారేమిటి?' అని పొడిచింది.

సుబ్బారావుకి మాత్రం ఏం తెలుసు ఏం చేయాలో? కాసేపు ఆలోచించి అమ్మాయి పార్టీలో వేసుకున్న బట్టలు ఉతకవద్దని చెప్పి , వాటిని జాగ్రత్తగా ప్లాస్టిక్ సంచిలో దాచి పిల్లతో పాటు డాక్టర్ దగ్గిరకి వెళ్ళాడు. ఆవిడ పరీక్షచేసి చెప్పింది, 'రేప్ జరిగిందో లేదో చెప్పలేను,' కానీ రక్తం కారింది. అది మీ అమ్మాయిదా ఆ అబ్బాయిదా అనేది పరీక్ష

చేయాలి. మిగతా ద్రవాలు ఏవైనా ఉంటే అవీ చూస్తారు. మరకలు ఉన్న బట్టలు కానీ ఉతకలేదు కదా?' లేదని చెప్పాక ఆవిడ ఎక్కడకి వెళ్ళాలో ఎవరు ఈ పరీక్షలు చేస్తారో చెప్పాక సుబ్బారావు సందేహంగా అడిగాడు, "ఇటువంటి ప్రశ్న ఎలా అడగాలో తెలియదు, రేప్ చేయబడి ఉంటే పాపకి కడుపు రాకుండా చేయడం ఎలా? ఇప్పుడేమైనా మందు ఇవ్వగలరా?"

ఆవిడ చెప్పింది, "పిల్లకి కానీ పీరియడ్స్ వచ్చే టైమ్ తెలిస్తే ఉజ్జాయింపుగా గణించవచ్చు గానీ ఏమీ చెప్పలేం. ఈ స్థితిలో మందులు ఏవీ పనిచేయకపోవచ్చు. నేను మీ అమ్మాయితో మాట్లాడినప్పుడు అసలు నిజంగా రేప్ జరిగిందా అనేది పాప చెప్పలేకపోతోంది షాక్ వల్ల. కీడెంచి మేలెంచాలి కనక ఈ మందు వాడండి ముందస్తుగా" అంటూ ఓ కాయితం చేతిలో పెట్టింది.

అది ఫార్మసీ లోంచి తెచ్చుకోవాలి. ఇంకా రెండు , మూడు పనులున్నాయి. ఆ కుర్రాడెవరో తెలుసుకోవడం. పోలీస్ రిపోర్ట్ ఇవ్వడం వగైరా.

మర్నాడు డాక్టర్ చెప్పిన చోటికి పాప బట్టలు పట్టుకెళ్ళి పరీక్షకి ఇచ్చారు. అవి వచ్చేసరికి మరో రెండు మూడు రోజులు. ఈ లోపుల స్లీప్ డేట్ ఇచ్చిన పాప ఇంటికెళ్ళి వాళ్ళ తల్లితండ్రులతో మాట్లాడాడు సుబ్బారావు. ఆ కుర్రాడు ఎవరూ, ఎలా వారితో మాట్లాడ్డం అనేవన్నీ. అక్కడనుంచి వస్తూంటే ఆ పాప తండ్రి హెచ్చరించాడు సుబ్బారావుని – కుర్రాడు చేసినది తప్పే అయితే సుబ్బారావు కానీ తొందరపడి ఆ కుర్రాడిని కొట్టినా తిట్టినా మరో పోలీస్ కేస్ అయి ముందు సుబ్బారావు జైల్లోకి వెళ్ళాల్సి ఉంటుంది.

ముందొక లాయర్ని మాట్లాడుకుంటే ఆయన చెప్తాడు ఏం చేయాలో. అలా లాయర్ దగ్గిర తేలి ఓ కేస్ వేసారు. స్లీప్ డేట్ ఇచ్చిన పాప తల్లి తండ్రులమీద ఒక అభియోగం – సుబ్బారావు కూతుర్ని సరిగ్గా చూడనందుకు, కౌగలించుకున్న కుర్రాడి మీదా వాడి పేరెంట్స్ మీదా మరో అభియోగం.

ఇది తెమిలో లోపున బట్టలమీద మరకల పరీక్షలు వచ్చాయి. ఆ రక్తం మరకలలో పాపవి ఉన్నాయ్ కానీ మరో రకం కూడా ఉంది, కుర్రాడిదే కాబోలు. మిగతా తెల్లటి మరకలు మనకి తెల్సినవే, ఊహించుకున్నవే – అవి కూడా కుర్రాడివే అయి ఉండొచ్చు. లాయర్ నోటీస్ వచ్చాక కుర్రాడి రక్తం, మిగతావి తీసి పరీక్ష చేసారు.

అప్పుడు కుర్రాడు నోరు విప్పాడు. తాను సుబ్బారావు కూతుర్ని కావలించుకోవడం, ముద్దు పెట్టుకోవడం నిజమే కానీ రేప్ చేయలేదు. అయితే బట్టల మీద మరకలు పడినది తన దేహంలోంచి వచ్చిన ద్రవమే కానీ తనకి మొదటి సారి ఎవరైనా అమ్మాయిని అలా కావలించుకోవడం; అంచేత పెనుగులాటలో, కంగారులో ముందే అలా అయింది.

ఈ లోపుల కుర్రాడి తండ్రీ, డేట్ ఇచ్చిన అమ్మాయి తండ్రీ కలిసి చెప్పారు సుబ్బారావుతో – ఈ విషయం మీరు నోరుమూసుకుంటే ఇంతా అని మేము డబ్బులు ఇచ్చుకుంటాం, తర్వాత వీడు మరోసారి అలా చేయకుండా ఒక థెరపీ కి,

మీ అమ్మాయి షాక్ నుంచి తేరుకోడానికి మరో థెరపీకీ తీసుకెళ్తారు. అబ్బే కాదు అంటే ఇటు వీడికీ, అటు మీ అమ్మాయికీ, తల్లి తండ్రులందరికీ కూడా పరువూ, పేరూ నష్టం కదా?

సుబ్బారావు లాయర్ తో చర్చించాడు. లాయర్ ఫీజు పోగా పిల్లకి తేరుకోవడానికో థెరపీ, కోర్టు ఖర్చులూ, పరువు నష్టం అన్నీ కలిపి ఒక అంకె చెప్పారు. దానికి వప్పుకున్నాక గప్ చుప్ గా నోరు మూసుకోకున్నారు రెండువైపులా.

ఇంటికొచ్చాక ఒక రకం ఏడుపుగొట్టు సంతోషం – పిల్లకి ఇలా జరిగినా రేప్ కానందుకూ, పిల్లకి ఈ వయసులోనే కడుపు రానందుకూ.

నీతి: ఎక్కడకి వాళ్ళని పంపినా మీ పిల్లల సెక్యూరిటీకి మీదే భాధ్యత.

Post your comments